ఎరువుల వ్యాపారుల ఇష్టారాజ్యం

- బహిరంగ మార్కెట్‌లో అడ్డగోలుగా ఎరువుల అమ్మకాలు
- రైతులను దోచుకుంటున్న వ్యాపారులు
- మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్న వ్యవసాయశాఖ
- దోపిడీకి అడ్డుకట్ట ఏదీ?



రిటైలర్ వద్ద కొనుగోలు చేసిన ఎరువులు

కంకిపాడు: బహిరంగ మార్కెట్ వ్యాపారుల ఇష్టారాజ్యం అయ్యింది. అన్నదాతలను దోచుకోవటమే పనిగా అడ్డగోలుగా ఎరువుల విక్రయాలు సాగిస్తున్నారు. ఎంఆర్‌పీని ఉల్లంఘించి అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారు. రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వ్యవసాయశాఖ మాత్రం మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతుందే తప్ప ఎరువుల కొరత నివారించటంలో వైఫల్యం చెందిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1.62 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగుకు అనువైన భూమి ఉంది. ఇప్పటికే దాదాపుగా లక్ష హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయి. వెద పద్ధతి, వరి నాటు, వరుస నాట్ల విధానంలో రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పైరు దుబ్బు దశలో ఉంది.

సొసైటీల్లో పలుకుబడి ఉన్నవారికే

నాలుగు రోజుల క్రితం గొడవర్రు సొసైటీకి ఎరువుల లోడు వచ్చింది. గ్రామంలో ఉన్న రైతులకు సమాచారం తెలిసి వెళ్లే సరికి ఎరువులు అయిపోయాయి. ఇది ఈ ఒక్క సొసైటీ పరిస్థితే కాదు. జిల్లాలో ఉన్న చాలా వరకూ సొసైటీల్లో ఇదే పరిస్థితి. ఎరువులు వచ్చిన వెంటనే లోడు ఖాళీ అవుతోంది. సొసైటీ ప్రతినిధులు తమ అనుయాయులకు, పలుకుబడి ఉన్న వాళ్లకు ముందస్తు సమాచారం అందించి లెక్కా పత్రం లేకుండా ఎరువులను అమ్మేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులకు, వాస్తవ సాగుదారులకు ఎరువులు దక్కటం లేదు.

మార్కెట్ మాయాజాలం

బయటి మార్కెట్‌లో ఎరువుల అక్రమ వ్యాపారం అడ్డగోలుగా సాగుతోంది. యూరియా బస్తా రూ.265.50 ఉంటే వ్యాపారులు రూ.330కి పైగా అమ్ముతున్నారు. 10.26 కాంప్లెక్స్ ఎరువు రూ.1720 ఉంటే రూ.1850కి అమ్ముకుంటున్నారు. రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డగోలుగా ఎంఆర్‌పీ ఉల్లంఘిస్తూ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తూ అన్నదాతలను దోచుకోవటమే పనిగా పెట్టుకున్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులకు జింకు, గుళికలు కూడా కొనుగోలు చేస్తేనే ఎరువులు విక్రయిస్తుండటం గమనార్హం. ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఎరువుల కృత్రిమ కొరతతో నానా కష్టాలు పడుతున్నామంటూ రైతులు వాపోతున్నారు.

అధికారుల అలసత్వం.. కూటమి నిర్లక్ష్యం

కొద్ది రోజులుగా ఎరువుల కొరత, బహిరంగ మార్కెట్‌లో అన్నదాతల దోపిడీ జరుగుతున్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. రైతులు ఎరువుల కొరతతో ఇబ్బందులు పడుతున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెట్టి అంతా సక్రమం అంటూ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనటానికి ఇబ్బందులు పడుతున్న రైతులే నిదర్శనం. బహిరంగ మార్కెట్‌లో జరుగుతున్న దోపిడీపై అధికారుల ఉదాసీన వైఖరి చూస్తే 'మామూలు' పంపకాలు భారీగా ఉన్నాయంటూ పలువురు విమర్శిస్తున్నారు.

యూరియా కట్ట లేదు



నేను 12 ఎకరాలు సాగుచేస్తున్నా. ఎప్పుడూ లేదు. ఈ సీజన్‌లో యూరియాకు చాలా ఇబ్బంది పడుతున్నాం. ఎక్కడ సొసైటీకి వెళ్లినా కట్ట కూడా దొరకటం లేదు. విషయం తెలుసుకుని వెళ్లేలోపే ఎరువులు అయిపోయాయంటున్నారు. అధికారులు పట్టించుకోవటం లేదు. మార్కెట్లో రూ.50 పైగా అదనంగా అమ్ముకుంటున్నారు.

– ముక్కామల శంకర్‌రావు, రైతు, ఈడుపుగల్లు

పలుకుబడి ఉంటేనే ఎరువులు



నేను 11.50 ఎకరాలు కౌలు చేస్తున్నా. ఈ సీజన్‌లో ఎరువులకు పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు. యూరియా కోసం వెళితే జింకు, గుళికలు కొనాలని ఒత్తిడి తెస్తున్నారు. వ్యాపారుల ఇష్టారాజ్యం అయ్యింది. సొసైటీల్లో ఎరువులు పలుకుబడి ఉంటేనే ఇస్తున్నారు. మార్కెట్‌లో జరుగుతున్న దోపిడీపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మాదు అరుణ్‌కుమార్, కౌలురైతు, ఈడుపుగల్లు

ఎంఆర్‌పీ కంటే ఎక్కువకే



బయటి మార్కెట్‌లో కాంప్లెక్స్ ఎరువులు తెప్పించాం. రూ 1720 దానిమీద రేటు ఉంటే రూ 1850 రేటు నిర్ణయించారు. అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. అదేమంటే స్టాకు రావటం లేదని చెబుతున్నారు. అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– బొబ్బా సీతారామయ్య, రైతు, ఈడుపుగల్లు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ..కానూరు ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ కారణంగా ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు



గన్నవరం: మండలంలోని దావాజిగూడెం గ్రామంలో గన్నవరం- ఉంగుటూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై అడుగుకో గుంత పడి గోతుల మయంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామంలోని పాత గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్ద, జెండా చెట్టు నుంచి ఏలూరు కాలువ దిగువ వరకు గోతులతో రహదారి పూర్తిగా దెబ్బతింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లోకి నీరుచేరడంతో రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా సెంట్రల్ విద్యుత్ స్తంభం



గన్నవరం: చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ నిమిత్తం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. సెంటర్ డివైడర్‌పై ఉన్న ఈ స్తంభాన్ని ఇటీవల ఓ వాహనం ఢీకొట్టడంతో ఒక పక్కకు ఒరిగిపోయింది. అప్పటి నుంచి ఈ స్తంభానికి ఎటువంటి మరమ్మతులు చేపట్టకుండా అలాగే వదిలివేశారు. దీంతో పక్కకు ఒరిగిన ఈ భారీ స్తంభం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని పరిసర ప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను పర్యవేక్షిస్తున్న అధికారులు ఒరిగిన స్తంభానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా విఖనస మహర్షి జయంతి



దావాజిగూడెం(గన్నవరం): మండలం లోని దావాజిగూడెంలో సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం శ్రీవిఖనస మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. అనంతరం శ్రీవిఖనస స్వామివారికి పంచామృత స్నపన, విశేష అర్చనలు నిర్వహించారు. నూతన వటువులకు సామూహిక ఉపాకర్మలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీవిఖనస స్వామికి అత్యంత వైభవంగా శోభయాత్ర నిర్వహించారు. దావాజిగూడెం, గన్నవరంలో గ్రామోత్సవం అనంతరం శోభయాత్ర తిరిగి ఆలయానికి చేరుకుంది. అనంతరం వైఖానస యూత్ ఫోరం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపూడిలో దాసరి సూర్యప్రకాష్ (32) తన తల్లి పుష్పలత, సోదరుడు చిన్నరాజుతో కలిసి నివసిస్తున్నారు. గొల్లపూడిలో వెల్డింగ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే పుష్పలత, చిన్నరాజులు ఇద్దరూ మానసిక సమస్యలతో జీవిస్తున్నారు. అయితే సూర్యప్రకాష్ కుటుంబ సభ్యుల సమస్యలతో పాటుగా తనకు వివాహం కావటం లేదనే బాధతో అప్పుడప్పుడు తన పెదనాన్న కుమారుడు విజయకుమార్‌తో బాధలు చెప్పుకుంటూ ఉండేవాడు. ఈ నెల మూడో తేదీన గడ్డి మందును మద్యంలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆ మరుసటి రోజు ఆ విషయం తెలుసుకున్న సూర్యప్రకాష్ బాబాయి దాసరి విజయకుమార్ ఆయన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సూర్యప్రకాష్ శనివారం తెల్లవారుజామున మరణించాడు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే వంశీని కలిసిన పార్టీ నేతలు



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో కోర్టు మంజూరు చేసిన బెయిల్ షరతుల మేరకు ఆయన పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేశారు. అదే విధంగా నియోజకవర్గంలోని వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్లలో కూడా బెయిల్ కండిషన్ల మేరకు ఆయన సంతకాలు చేశారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళలు, విద్యార్థినులు పీఎస్‌ల వద్దకు వచ్చి వంశీమోహన్‌కు రాఖీలు కట్టారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం వంశీమోహన్ విజయవాడ బయలుదేరివెళ్లారు.

నేడు కంటి వైద్యశిబిరం

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తుమ్మలపల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి హరికృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బోడె ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు, ఫినిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శుక్లాల ఆపరేషన్ ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య విజ్ఞానం చేరువ చేయటమే లక్ష్యం

మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ


ఎగ్జిబిషన్‌లో సందర్శకులకు వివరిస్తున్న డాక్టర్


న్యూరాన్ స్ట్రక్చర్‌ను విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్

గన్నవరం రూరల్: ఆరోగ్య విజ్ఞానం అందరికీ చేరువ చేయడమే లక్ష్యమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం కళాశాలలో 6వ రోజు మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌ను మూడు వేల మంది సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలోని అవయవాలు, పని తీరు, చెడు అలవాట్లతో వాటిని పాడు చేసుకుంటున్న విధానాలపై డిజిటల్ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ మాట్లాడుతూ హెల్త్, మెడికల్ ఎగ్జిబిషన్‌లకు ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు అకాడమి సొంతం చేసుకుందని, ఈ మహత్తర కార్యక్రమంతో మరిన్ని సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్న సంకల్పం బలపడిందని చెప్పారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కల్యాణి, హెచ్‌వోడీలు, ఏవోలు, డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

డెంటల్ కళాశాలలో..

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఎక్స్ ఫ్లోర్–25 పేరిట 6వ రోజు ఎగ్జిబిషన్‌ను వేలాది మంది సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో దంత వైద్యంలో 9 విభాగాలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా సందర్శకులకు వైద్యులు దంతాల ప్రాముఖ్యత వివరించారు. హెచ్‌వోడీలు డాక్టర్ కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ, ఏవో వై.మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

చిన ఓగిరాల వద్ద రోడ్డు ప్రమాదం

మానవత్వం చాటిన ఎస్‌ఐ సందీప్


ప్రభుత్వాస్పత్రికి వద్ద ఎస్‌ఐ సందీప్, గాయపడ్డ బాలిక

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో బాలిక గాయాలపాలైంది. అటుగా వెళ్తున్న కంకిపాడు ఎస్‌ఐ డి.సందీప్ ప్రమాదాన్ని గుర్తించి మానవత్వాన్ని చాటారు. ప్రమాదానికి గురైన బాలికను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి వైద్యం అందించేలా చేశారు.

వివరాల్లోకి వెళితే..

పమిడిముక్కల మండలం గడ్డిపాడు గ్రామానికి చెందిన తుమ్మలపల్లి శ్రీనివాసరావు, తన భార్య, కుమార్తె చరిత (12)తో స్కూటీపై విజయవాడ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా చిన ఓగిరాల వద్ద స్కూటీ వెనుక టైరు పంక్చర్ అయ్యింది. దీంతో వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ప్రమాదంలో చరితకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎస్‌ఐ డి.సందీప్ ప్రమాదాన్ని గుర్తించి గాయాలపాలైన చరితను పోలీసు వాహనంలోనే ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవటంతో అందరూ అభినందించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అనాథ ఆశ్రమానికి సరుకుల పంపిణీ


అనాథ బాలలకు చాక్లెట్స్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పెనమలూరు: పోరంకి గ్రామంలోని వల్లూరుపల్లి నవరత్నమ్మ, కేశవరావు అనాథ బాలల ఆశ్రమంలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి రావి సురేష్‌బాబు మాట్లాడుతూ అనాథ బాలలకు నిత్యావసర సరుకులతో పాటు కూరగాయాలు, బిస్కెట్‌లు, చాక్లెట్స్, కొత్త దుస్తులు పంపిణీ చేశామన్నారు. చిన్నారులతో రాఖీ పండుగ చేసుకుని, రాఖీలు కట్టించుకున్నామని తెలిపారు. తమ క్లబ్‌తో మెడికల్ క్యాంపులతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ పి.కిరణ్‌కుమార్‌నాయుడు, ట్రెజరర్ కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, సభ్యులు కాట్రగడ్డ రామకృష్ణ, కాసరనేని కృష్ణప్రసాద్, సువర్ణబాబు, సోమేశ్వరరావు, డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా నరసింహారావు

గన్నవరం: గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడుకు చెందిన గూడవల్లి నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కమిటీ గౌరవ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా కొండేటి వెంకటేశ్వరరావు, మరో 17 మందిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. తొలుత ఏఎంసీ చైర్మన్‌గా జనసేనకు చెందిన గరికపాటి శివశంకర్‌కు ప్రభుత్వం కేటాయించింది. గరికపాటి నియామకం పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర వ్యతిరేకత వ్యక్త పరిచారు. దీంతో గరికపాటి నియామకాన్ని రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా కొత్త కమిటీని ప్రకటించింది. యార్లగడ్డ ప్రతిపాదించిన ప్రకారం టీడీపీకి చెందిన గూడవల్లి నరసింహారావుకు ఏఎంసీ చైర్మన్ పదవిని కేటాయించారు. ఏఎంసీ చైర్మన్ మార్పు పట్ల జనసేన శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ బాబు

- పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చక్రవర్తి
- పెనమలూరులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ


సమావేశంలో ప్రసంగిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను అన్ని విధాలుగా దగా చేశారని, మోసాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు నిలిచారని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ధ్వజమెత్తారు. పెనమలూరు సెంటర్‌లో కిలారు అనిల్ ఎస్టేట్‌లో శనివారం రాత్రి బాబుషూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జగనన్న అధికారంలో ఉన్న కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల పక్షాన నిలిచారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు అమలుకాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఉచిత ఇసుక అని చెప్పి నేడు దోచేసుకుంటున్నారని, జగనన్న పాలనలో ప్రభుత్వానికి రూ.750 కోట్ల ఇసుక ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థులు చదువుకోలేని స్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఎన్నడూ ఎన్టీఆర్ విగ్రహాలు తొలగించలేదని, జిల్లాకు కూడా ఎన్టీఆర్ పేరు పెట్టామని, అయితే చంద్రబాబు పాలనలో మహానేత వైఎస్సార్ విగ్రహాలు తొలగించటం చంద్రబాబు కుళ్లు రాజకీయానికి నిదర్శనమని విమర్శించారు.

రోజుకు రూ.10 లక్షలు

చోడవరం, మద్దూరు ఇసుక క్వారీల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు రోజూ రూ.10 లక్షల ఆదాయం వస్తుందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ జీవో ప్రకారం టన్ను ఇసుక రూ.150 అయితే లారీ ఇసుక రూ.3 వేలకు ఇవ్వాలన్నారు. అయితే నేడు లారీ ఇసుక రూ.10 వేలకు పైనే అమ్ముతున్నారని విమర్శించారు. ప్రైవేటు రైతు బజార్‌లో కిలో కూరగాయాలకు మార్జిన్ రూ.4 పెట్టి బొక్కుతున్నారని, అదనంగా దుకాణాల వద్ద సొమ్ము వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

పులివెందలలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నేతల పై దాడులు, ఎన్నికల్లో టీడీపీ అరాచకాలకు నిరసనగా సభలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా చక్రవర్తికి మహిళా నేతలు రాఖీ కట్టారు. తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, పార్టీలో వివిధ విభాగాల నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, కోడెపండు, అబ్దుల్‌మతిన్, మండూరు కోటేశ్వరరావు, శీలం శ్రీరాములు, ఎండీ.హక్, ఉప్పాల వీరబాబు, కర్రాఆదిశేషారావు, చాంద్‌బాషా, యార్లగడ్డ వీరబాబు, కాసాని ఫణి, అబ్దుల్ గని, మల్లంపల్లి వెంకటేశ్వరరావు, లింగాల శోభన్‌బాబు, గద్దల రాజ, వరప్రసాద్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిఫాల్ట్ రుణ గ్రహీతలకు అవకాశం

పీఎన్‌బీలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్

పెనమలూరు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (వోటీఎస్) కార్యక్రమం చేపట్టిందని సర్కిల్‌హెడ్ పంకజ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కామయ్యతోపులోని సర్కిల్ కార్యాలయంతో పాటు విజయవాడ సర్కిల్ పరిధిలోని అన్ని బ్రాంచిలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిఫాల్ట్ రుణ గ్రహీతలు తీసుకున్న రుణాలను పరిష్కరించుకోవాలని ఈ అవకాశం కల్పించామన్నారు.

పీఎన్‌టీ ల్యాబ్ ప్రారంభం



పెనమలూరు: కానూరు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం పొజిషనింగ్, నావిగేషన్ అండ్ టైమింగ్ ల్యాబ్‌ను (పీఎన్‌టీ) ఏపీ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ సుందర్‌బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరిశోధనలకు ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రూరల్ రోడ్ ప్రాజెక్టు మేనేజర్ పీవీ. రమణమూర్తి, ఐఐటీ తిరుపతి ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొఫెసర్ రోషన్ శ్రీవాస్తవ్, వైస్‌ఛాన్సలర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఐటీ విభాగాధిపతి ఎం. సునీత, సీఎస్‌ఈ విభాగాధిపతి రాజేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: నగరంలోని యోగ ప్రభ ఆయుర్వేద సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యాన నగరంలోని 45 డివిజన్ సచివాలయం వద్ద ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిర కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. యోగ ప్రభ శ్రీ వైద్యశాల డాక్టర్ ముత్తేవి కృష్ణమాచార్యులు, డాక్టర్ ముత్తేవి రాజా రవి కిరణ్ ల ఆధ్వర్యంలో నయాటికా, మెడ నొప్పి, డిస్క్ మరియు నరాల సమస్యలకు, కీళ్లవాతం, మోకాళ్ళ నొప్పులకు అన్ని రకాల చర్మవ్యాధులకు ఈ ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు.